
జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
మహబూబ్‌నగర్


నాగర్ కర్నూల్, వనపర్తి
జోగులాంబ గద్వాల
నారాయణపేట
శనివారం, ఆగస్టు 8, 2026 పేజీలు: 8


## బాధిత కుటుంబానికి ప్రభుత్వం

# అండగా ఉంటుంది

-ఎక్లాస్‌పూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను సందర్శించిన జిల్లా కలెక్టర్ ప్రియాంక

-విద్యార్థి మృతి అత్యంత దురదృష్టకరం



**నారాయణపేట ప్రతినిధి ఆగస్టు 07 (ప్రజా జ్యోతి)**

నారాయణపేట మండలం ఎక్లాస్‌పూర్ ప్రభుత్వ మండల పరిషత్ ప్రాథమికోన్న త పాఠశాలను శుక్రవారం జిల్లా కలెక్టర్ శ్రీమతి ప్రియాంక సందర్శించారు. ఈ నెల 6వ తేదీన ఆ పాఠశాలలో మూడో తరగతి విద్యార్థి రంజిత్ పాముకాటుకు గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన దురదృష్టకర ఘటన నేపథ్యంలో కలెక్టర్ పాఠశాలను సందర్శించి, విద్యార్థి పాముకాటుకు గురైన తరగతి గది, కిటికీలు, పాఠశాల పరిసరాలను ప్రత్యక్షంగా పరిశీలించారు.ఈ సందర్భంగా విద్యార్థి మృతి పట్ల కలెక్టర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.మన జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో వేలాది మంది



## ఎట్టి పరిస్థితుల్లోనూ వరి, పత్తి

# సాగు చేయవద్దు

-రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు వచ్చే అవకాశం

- వరి, పత్తికి బదులుగా ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు విస్తృత అవగాహన కల్పించాలి
- రైతులను ప్రత్యామ్నాయ పంటల వైపు మళ్లించాలి
- నీటిపారుదల శాఖపై ప్రత్యేక సమీక్ష, రాష్ట్ర మంత్రులు ఉత్తమ్ కుమార్, తుమ్మల నాగేశ్వరరావు, జూపల్లి కృష్ణారావు
- జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్



## ఎల్ఐ, పాలమూరు-రంగారెడ్డి పంపులను వెంటనే ప్రారంభించాలి

### లేదంటే ఆగస్టు 11 తర్వాత నార్లాపూర్ ముట్టడి : మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్



**మహబూబ్‌నగర్, ఆగస్టు 7 ( ప్రజా జ్యోతి బ్యూరో ):** శ్రీశైలం జలాశయంలో నీటి మట్టం 162 టీఎంసీలకు చేరినా కల్వకుర్తి ఎత్తిపోతల పథకం (కేఎల్ఐ) ఎల్లూరు పంపులు, పాలమూరు--రంగారెడ్డి ఎత్తిపోతల పథకం నార్లాపూర్ పంపులను ప్రారంభించకుండా కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మాజీ మంత్రి విరసనోల్ల శ్రీనివాస్ గౌడ్ ఆరోపించారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని వెంటనే పంపులను ప్రారంభించి రిజర్వాయర్లను నింపడంతో పాటు ఆయకట్టుకు సాగునీటిని విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు.శుక్రవారం మహబూబ్‌నగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, శ్రీశైలం జలాశయానికి భారీగా వరద ప్రవాహాలు వస్తున్నప్పటికీ రైతులకు సాగునీరు అందించేందుకు ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడం దురదృష్టకరమన్నారు. తెలంగాణకు అందుబాటులో ఉన్న నీటిని వినియోగించుకోకుండా ఆంధ్రప్రదేశ్‌కు నీరు

# ప్రత్యామ్నాయ పంటలే రైతులకు భరోసా

-వరి సాగు విస్తరించొద్దు

- ఆగస్టు 15 నుంచి 1.05 కోట్ల కుటుంబాలకు తెలంగాణ స్మార్ట్ రేషన్ కార్డులు - జిల్లా కలెక్టర్లకు రాష్ట్ర మంత్రుల ఆదేశాలు

**మహబూబ్‌నగర్, ఆగస్టు 7 ( ప్రజా జ్యోతి బ్యూరో ):** రాష్ట్రంలో రానున్న రోజుల్లో వర్షాభావ పరిస్థితులు నెలకొనే అవకాశాలు ఉన్న నేపథ్యంలో అధిక నీటి అవసరమున్న వరి సాగును మరింత విస్తరించకుండా రైతులను ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు మళ్లించాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. అలాగే ఆగస్టు 15 నుంచి రాష్ట్రంలోని 1.05 కోట్ల కుటుంబాలకు తెలంగాణ స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక, యువజన సేవల శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వ్యవసాయం, వర్షాభావ



# బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుంది

విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారని, వారికి ప్రభుత్వం అవసరమైన మౌలిక వసతులు, విద్యా సదుపాయాలను కల్పిస్తోందని తెలిపారు. అయినప్పటికీ ఎక్లాస్‌పూర్ పాఠశాలలో జరిగిన ఈ ఘటన అత్యంత బాధాకరమని విచారం వ్యక్తం చేశారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా తక్షణ చర్యలు చేపడతామని స్పష్టం చేశారు.పాఠశాలను సమగ్రంగా పరిశీలించి, అవసరమైన మరమ్మతులు, అభివృద్ధి పనులను వెంటనే చేపట్టాలని ఇంజినీరింగ్ శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేస్తామని తెలిపారు. ముఖ్యంగా పాఠశాల వెనుక భాగంలో ఉన్న పొదలు, చెట్లు, కొండ ప్రాంతాలను పూర్తిగా శుభ్రపరిచి, విద్యార్థుల భద్రతకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని చెప్పారు.

బాధిత కుటుంబానికి ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎం రిలీఫ్ ఫండ్) నుంచి ప్రత్యేక ఆర్థిక సహాయం అందేలా ఇప్పటికే సంబంధిత ప్రతిపాదనలు పంపించామని, అర్హత మేరకు త్వరితగతిన సహాయం అందించేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ భరోసా ఇచ్చారు.అదేవిధంగా స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ సర్పంచ్‌తో సమన్వయం చేసుకొని పాఠశాలలో టాయిలెట్లు, బాత్ రూములు, భద్రతా గోడలు, ఇతర మౌలిక వసతుల అభివృద్ధికి అవసరమైన పరిపాలనా అనుమతులను (సాంక్షన్‌లు) తక్షణమే మంజూరు చేసేలా చర్యలు చేపడతామని తెలిపారు.విద్యార్థుల భద్రతే ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని పేర్కొన్న కలెక్టర్, జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలను సమగ్రంగా సమీక్షించి, అవసరమైన చోట మరమ్మతులు, అభివృద్ధి పనులను వెంటనే చేపట్టి, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటామని ఆమె వెల్లడించారు.

# ఎట్టి పరిస్థితుల్లోనూ వరి, పత్తి సాగు చేయవద్దు

నాగర్ కర్నూల్ ఆగస్టు 7 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)

ఎల్‌నినో ప్రభావం కారణంగా ఆగస్టు 15వ తేదీ తర్వాత రాష్ట్రంలో మళ్లీ వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశాలు ఉన్న నేపథ్యంలో రైతులు ఎట్టి పరిస్థితుల్లోనూ వరి, పత్తి పంటలను సాగు చేయకుండా ప్రత్యామ్నాయ పంటల వైపు మళ్లించేలా వ్యవసాయ, నీటిపారుదల శాఖలు అత్యవసర కార్యాచరణ చేపట్టాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలను చూసి రైతులు పెద్దఎత్తున వరి నాట్లు వేస్తున్నప్పటికీ, రానున్న రోజుల్లో సాగునీటి కొరత తీవ్రంగా ఉండే అవకాశం ఉన్నందున రైతులకు ముందుగానే వాస్తవ పరిస్థితులను వివరించి నష్టాల నుంచి కాపాడాలని కలెక్టర్ సూచించారు.శుక్రవారం సాయంత్రం హైదరాబాద్ సెక్రటేరియట్ నుండి రాష్ట్ర మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్రంలోని వర్షపాతం పరిస్థితులు, సాగునీటి లభ్యత, ఖరీఫ్ సాగు, వ్యవసాయ ప్రణాళికలపై విస్తృతంగా సమీక్షించారు.ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రులు మాట్లాడుతూ రానున్న రెండు రోజుల్లో ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో అధిక వర్షాలు కురిసే అవకాశం ఉన్నప్పటికీ, రాష్ట్రంలోని మిగిలిన ప్రాంతాల్లో అక్కడక్కడా మాత్రమే మోస్తరు వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ అంచనాలను వివరించారు. ఎల్‌నినో ప్రభావం వల్ల ఆగస్టు 15 తర్వాత మళ్లీ వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశాలు ఉన్నందున అన్ని జిల్లాల అధికారులు ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని సూచించారు.రైతులు నీటి లభ్యతను దృష్టిలో పెట్టుకోకుండా వరి, పత్తి పంటలు సాగు చేస్తే తరువాత తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని పేర్కొంటూ,..ప్రత్యామ్నాయ పంటల సాగుపై విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు.వీడియో కాన్ఫరెన్స్ అనంతరం అధికారులతో జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ జిల్లా అధికారులతో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రస్తుతం జిల్లాలో కురుస్తున్న వర్షాలను చూసి రైతులు పెద్దఎత్తున వరి సాగు ప్రారంభిస్తున్నారని, అయితే రానున్న రోజుల్లో నీటి ఎద్దడి ఏర్పడే పరిస్థితులు ఉన్నందున కృష్ణా నది నుంచి అందుబాటులో ఉండే నీటితో అన్ని వరి పొలాలకు సాగునీరు అందించడం సాధ్యం కాదన్నారు.ఈ వాస్తవాన్ని ప్రతి రైతుకు స్పష్టంగా వివరించి, భవిష్యత్తులో నష్టాలు ఎదురుకాకుండా వ్యవసాయ, నీటిపారుదల శాఖ అధికారులు సంయుక్తంగా గ్రామాల వారీగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. రైతులు భావోద్వేగాలకు లోనుకాకుండా శాస్త్రీయంగా నిర్ణయాలు తీసుకునేలా అధికారులు కృషి చేయాలని సూచించారు.ప్రస్తుతం కృష్ణానది నుంచి అందుబాటులో ఉన్న నీటి పరిమాణం ఎన్ని ఎకరాలకు సాగునీరు అందించగలదో ఖచ్చితంగా అంచనా వేసి, దానికి అనుగుణంగా మాత్రమే పంటల సాగు జరిగేలా కార్యాచరణ రూపొందించాలని కలెక్టర్ సూచించారు. నీటి లభ్యతను మించి సాగు విస్తరించకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో సాగునీటి పరిస్థితులు, రిజర్వాయర్లలో నీటి నిల్వలు, సాగు విస్తీర్ణం, రైతులకు అందించాల్సిన సూచనలపై ఈ నెల 11న జిల్లా ప్రజాప్రతినిధులు, నీటిపారుదల శాఖ అధికారులతో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. భవిష్యత్తులో ఎదురయ్యే పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని ముందస్తు నిర్ణయాలు తీసుకోవాలని తెలిపారు.రానున్న ఏడు నుంచి పది రోజులు అత్యంత కీలకమని పేర్కొన్న కలెక్టర్, ఈ వ్యవధిలో వరి, పత్తికి బదులుగా ప్రత్యామ్నాయ పంటల సాగు లక్ష్యాన్ని సాధించేలా వ్యవసాయ శాఖ ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని ఆదేశించారు. ప్రతి మండలం, ప్రతి క్లస్టర్ స్థాయిలో అధికారులు రైతులతో సమావేశాలు నిర్వహించి ప్రత్యామ్నాయ పంటల ప్రయోజనాలను వివరించాలని సూచించారు.ప్రతి క్లస్టర్ పరిధిలో కనీసం 100 ఎకరాల్లో కూరగాయల సాగు జరిగేలా ప్రణాళిక రూపొందించాలని, రైతులను ఉద్యాన పంటల వైపు ప్రోత్సహించాలని తెలిపారు.పాలెం వ్యవసాయ కళాశాల విద్యార్థులు, శాస్త్రవేత్తలు, వ్యవసాయ విస్తరణ అధికారుల సహకారంతో గ్రామాల్లో పెద్దఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కాలంలో సాగుకు అనువైన ప్రత్యామ్నాయ పంటలు, తక్కువ నీటితో అధిక దిగుబడి వచ్చే పంటలు, భూసార పరిరక్షణ, ఆధునిక సాగు విధానాలపై రైతులకు వివరించాలని సూచించారు.వ్యవసాయానికి దీర్ఘకాలికంగా నీటి భద్రత కల్పించేందుకు ఫామ్ పాండ్ల నిర్మాణం, వర్షపు నీటి సంరక్షణ, భూగర్భ జలాల వినియోగం, నీటి పొదుపు పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ తెలిపారు. నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవడం ద్వారానే భవిష్యత్‌లో వర్షాభావ పరిస్థితులను అధిగమించవచ్చని తెలిపారు.ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అధికారులు మండలాల వారీగా ప్రత్యేక అధికారులుగా హాజరై ప్రజల నుంచి వినతులు స్వీకరించాలని కలెక్టర్ ఆదేశించారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.00 గంటల వరకు ప్రజావాణిలో అందిన ప్రతి ఫిర్యాదును నమోదు చేసి, నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సూచించారు.జిల్లా ప్రజావాణితో పాటు ముఖ్యమంత్రి ప్రజావాణిలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను వెంటనే పరిష్కరించేలా శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.
జిల్లాలో విద్యా ప్రమాణాలు, మౌలిక సదుపాయాలు, విద్యార్థుల హాజరు, పాఠశాలల నిర్వహణ తదితర అంశాలపై ఈ నెల 11వ తేదీన విద్యాశాఖపై సమగ్ర సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. సంబంధిత అధికారులు పూర్తి సమాచారంతో సమావేశానికి హాజరు కావాలని సూచించారు.
జిల్లాకు కొత్తగా స్మార్ట్ రేషన్ కార్డులు చేరుకున్నాయని, వాటిని మండలాలు, గ్రామపంచాయతీల వారీగా వర్గీకరించి ఈ నెల 16వ తేదీ నుంచి పంపిణీ ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అర్హులైన ప్రతి కుటుంబానికి పారదర్శకంగా రేషన్ కార్డులు అందేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు.వనమహోత్సవ కార్యక్రమంలో జిల్లాకు నిర్దేశించిన మొక్కల నాటే లక్ష్యాన్ని పూర్తి చేయడమే కాకుండా, నాటిన ప్రతి మొక్క బతికేలా సంరక్షణ చర్యలు చేపట్టాలని కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ అధికారులను ఆదేశించారు.
ప్రభుత్వం చేపడుతున్న ప్రతి కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలోసమర్థవంతంగా అమలు చేసి ప్రజలకు పూర్తి స్థాయిలో ప్రయోజనం చేకూరేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు బి చేన్నయ్య, దేవ సహాయం, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు

# ఎల్ఐ, పాలమూరు-రంగారెడ్డి పంపులను వెంటనే ప్రారంభించాలి

తరలిపోతుండగా ప్రభుత్వం మౌనంగా ఉండడం రైతుల ప్రయోజనాలకు విరుద్ధమని విమర్శించారు. ఒకవైపు పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్, మాల్యాల పంప్ హౌస్‌ల ద్వారా ఆంధ్రప్రదేశ్ నీటిని వినియోగించుకుంటుంటే, మరోవైపు తెలంగాణ ప్రభుత్వం శ్రీశైలం నుంచి నీటిని ఎత్తిపోసుకోకపోవడం అసమర్థతకు నిదర్శనమని అన్నారు. పాలమూరు వంటి కరువు ప్రాంతానికి నీరు అందించే విషయంలో ప్రభుత్వం చొరవ చూపకపోవడాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. చంద్రబాబు ప్రభుత్వంలో పనిచేసిన ఆదిత్యనాథ్ దాస్‌ను సలహాదారుగా నియమించుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ప్రయోజనాల పరిరక్షణలో మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని శ్రీనివాస్ గౌడ్ విమర్శించారు. పాలమూరు--రంగారెడ్డి ప్రాజెక్టులోని నార్లాపూర్ రిజర్వాయర్‌ను ఎల్లూరు రిజర్వాయర్‌తో అనుసంధానం చేసినందున, నార్లాపూర్‌లో నీటిని నింపితే ఎల్‌నినో పరిస్థితుల్లో కూడా కేఎల్ఐ పరిధిలోని రైతులకు సాగునీరు అందించే అవకాశం ఉందన్నారు. కరువు పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ముందస్తు చర్యలు చేపట్టాల్సిన ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపిస్తూ, నార్లాపూర్ పంపులను వెంటనే ప్రారంభించి రిజర్వాయర్లు, చెరువులు, కుంటలను నింపాలని, కాలువలకు నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి లక్ష్మా రెడ్డి మాట్లాడుతూ, పాలమూరు రైతులకు సాగునీరు అందించే వరకు పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. కృష్ణా నదికి భారీగా వరద ప్రవాహాలు వస్తున్నా నీళ్లు లేవని చెప్పి రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తోందని ఆరోపించారు. మాజీ ఎమ్మెల్యేలు అల వెంకటేశ్వర్ రెడ్డి, రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ, ఈ నెల 11వ తేదీ వరకు ప్రభుత్వానికి గడువు ఇస్తున్నామని, అప్పటిలోగా పంపులను ప్రారంభించకపోతే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో కలిసి లక్షలాది మంది రైతులతో నార్లాపూర్ ముట్టడి చేపడతామని హెచ్చరించారు. అక్కడ రైతులు, ప్రజలతో సమావేశమై భవిష్యత్ కార్యాచరణను ప్రకటిస్తామని వెల్లడించారు.

# ప్రత్యామ్నాయ పంటలే రైతులకు భరోసా

పరిస్థితులు, మండల ప్రజావాణి, వనమహోత్సవం, రేషన్ కార్డుల పంపిణీ, చేయూత పెన్షన్లు, పాఠశాల యూనిఫాం కుట్టు పనుల పురోగతిపై సమీక్షించారు. మహబూబ్‌నగర్ కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా, అదనపు కలెక్టర్లు మధుసూదన్ నాయక్, జె.ఎల్.బి. హరిప్రియ, ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ సాయి శివాని, డీఆర్వో నిర్మల తదితర అధికారులు పాల్గొన్నారు.మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ భారత వాతావరణ శాఖ అంచనాల ప్రకారం రానున్న నెలల్లో వర్షపాతం తగ్గే అవకాశమున్నందున రైతులు వరి వంటి అధిక నీటి అవసరమున్న పంటల సాగును పెంచకుండా ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసేలా విస్తృత అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం సాగునీటి విడుదలపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని, మరో 15 రోజుల పాటు ప్రధాన ప్రాజెక్టుల నీటి మట్టాలను సమీక్షించిన తర్వాత పరిస్థితులకు అనుగుణంగా నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. పేదల సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొన్న మంత్రి, గత ప్రభుత్వంలో కొత్త రేషన్ కార్డులు ఇవ్వలేదని, ప్రస్తుత ప్రభుత్వం 16 లక్షలకు పైగా కొత్త రేషన్ కార్డులను మంజూరు చేసిందన్నారు. రాష్ట్రంలోని 1.05 కోట్ల రేషన్ కార్డు లబ్ధిదారులకు ఆగస్టు 15 నుంచి తెలంగాణ స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేయనున్నట్లు వెల్లడించి, జిల్లాల్లో ఈ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్లను ఆదేశించారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి జిల్లాలో పంటల వైవిధ్యీకరణ కార్యాచరణ ప్రణాళికను సమర్థంగా అమలు చేయాలని సూచించారు. ప్రత్యామ్నాయ పంటలకు అవసరమైన విత్తనాలను ముందుగానే అందుబాటులో ఉంచాలని, ఆగస్టు 15 తర్వాత వర్షపాతం తగ్గే అవకాశమున్నందున నీటి లభ్యత ఆధారంగా సాగు ప్రణాళికలు రూపొందించాలని చెప్పారు.

## విద్యార్థి మరణానికి రేవంత్ రెడ్డి నైతిక బాధ్యత వహించాలి!



నారాయణపేట ప్రతినిధి ఆగస్టు 07 (ప్రజా జ్యోతి)
నారాయణ పేట జిల్లా ఎక్లాస్ పూర్ ప్రభుత్వ పాఠశాలలో 3వ తరగతి విద్యార్థి రంజిత్ పాము కాటు మరణానికి విద్యాశాఖ మంత్రి రేవంత్ రెడ్డి గారే నైతిక బాధ్యత వహించాలని బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) జిల్లా అధ్యక్షులు బొదిగెలి శ్రీనివాస్ డిమాండ్ చేశారు.విద్యార్థి కుటుంబానికి కోటి రూపాయల ఎక్స్ గ్రేసియా చెల్లించి,బాధిత కుటుంబంలో అర్హత గల వారికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని జిల్లా విద్యా శాఖ అధికారికి వినతి పత్రం అందించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ బడుల్లో చదివే పేద విద్యార్థుల ప్రాణాల కూడా రక్షణ లేకుండా పోయిందన్నారు. ప్రైవేటు బడుల మీద ఉన్న శ్రద్ధ ప్రభుత్వ బడుల మీద ప్రభుత్వానికి సోయి లేదన్నారు.జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలలో పరిశుభ్రత లోపించి అనేక సమస్యలు తలెత్తితే జిల్లా విద్యా శాఖ నిద్రపోతుందా అంటూ ప్రశ్నించారు.ఈ కార్యక్రమంలో పేట నియోజకవర్గ అధ్యక్షులు దాసరి అశోక్,కోశాధికారి రమేష్,మక్తల్ అసెంబ్లీ అధ్యక్షులు కొక్కు గౌతం,బీఎస్పీ నాయకులు అజయ్ కుమార్,శివ కుమార్ తదితరులు పాల్గొన్నారు

## విద్యార్థి మృతికి ప్రభుత్వ మే బాధ్యత వహించాలి

### బిజెపి రాష్ట్ర సీనియర్ నేత నాగురావునామాజీ




నారాయణపేట ప్రతినిధి ఆగస్టు 7 (ప్రజా జ్యోతి)
నారాయణపేట మండల ఏక్లాస్పూర్ ప్రభుత్వ పాఠశాలల్లో పాముకాటుకు మృతి చెందిన 3తరగతి చదువుతున్న రంజిత్ మృతికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని బిజెపి రాష్ట్ర సీనియర్ నేత రాష్ట్ర క్రమ శిక్షణ సంఘం సభ్యులు నాగురావు నామాజీ డిమాండ్ చేశారు.స్థానిక అప్పంపల్లి జిల్లా ప్రభుత్వ మెడికల్ ఆసుపత్రి లో సరైన చికిత్స అందక వైద్యుల నిర్లక్ష్యం వల్ల చనిపోవడం ఎంతో దిగ్భ్రాంతి కలిగించిం దన్నా రు.శుక్రవారం నారాయణ పేట జిల్లా బిజెపి అధ్య క్షుడు సత్య యాదవ్ ఏక్లాస్ పుర్ సర్పంచ్ చంద్రశేఖర్ గౌడ్, బీజేపీ జిల్లా ఆఫీస్ సెక్రెటరీ సాయి బన్న, మీడియా కన్వీనర్ కిరణ్ డగే ముఖ్య నాయకులతో కలిసి విద్యార్థి భౌతికకాయాన్ని నారాయణపేట లో ఉన్న పోస్టుమార్టం సెంటర్ లో సందర్శించి సంతాపం వ్యక్తం చేశారు.విద్యార్థి తండ్రిని కుటుంబ సభ్యుల ను పరామర్శించారు. అప్పక్ పల్లిలో ఉన్న జిల్లా ఆస్పత్రిలోనూ విద్యా ర్థికి సకాలంలో చికిత్స అందించక పోవడంతో మృతి చెందాడని ఇది డాక్ట ర్ల నిర్లక్షమని అన్నారు. ప్రభు త్వ నిర్లక్ష్యంతో చని పోయిన ఆ విద్యార్థి కుటుం బానికి ప్రభుత్వం పదిలక్షల ఎక్స్‌గ్రేషియా, ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని ఇల్లు నిర్మించి ఇవ్వాలని డిమాం డ్ చేశారు. అలాగే నారాయణపేట జిల్లా కేంద్రంలో ప్రజలకోసం వారి ఆరోగ్యంకోసం ప్రభుత్వ ఆసుపత్రికి తిరిగి ప్రారంభిం చకపోతే ఈ కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్రపరిణామా లు ఎదుర్కోవలసి వస్తుందని హెచ్చరించారు.

# జనగణన హ్యాండ్‌బుక్-2027ను గడువులోగా, ఖచ్చితమైన సమాచారంతో రూపొందించాలి

## డైరెక్టర్ భారతి హోళికేరి




**గద్వాల ఆగస్టు07(ప్రజా జ్యోతి ప్రతినిధి):**
జనగణన హ్యాండ్‌బుక్--2027ను ఖచ్చితమైన సమాచారంతో నిర్ణీత గడువులోగా రూపొందించాలని తెలంగాణ డైరెక్టర్ ఆఫ్ సెన్సస్ ఆపరేషన్స్ అధికారి భారతి హోళికేరి అధికారులను ఆదేశించారు. శుక్రవారం డైరెక్టర్ ఆఫ్ సెన్సస్ ఆపరేషన్స్ ఆధ్వర్యంలో జనగణన హ్యాండ్‌బుక్--2027 తయారీపై జిల్లా కలెక్టర్లు,జీహెచ్ఎంసీ కమిషనర్లు, జిల్లా స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా జనగణన హ్యాండ్‌బుక్ నిర్వహణ, కార్యాచరణ,అధికారుల బాధ్యతలు,అమలు షెడ్యూల్‌పై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.ఈ సందర్భంగా భారతి హోళికేరి మాట్లాడుతూ,తెలంగాణలోని అన్ని జిల్లాలు,జీహెచ్ఎంసీలకు తొలిసారిగా జిల్లా జనగణన హ్యాండ్‌బుక్‌లు రూపొందిస్తున్నట్లు తెలిపారు.గ్రామ,పట్టణ స్థాయిలో సమగ్ర సమాచారాన్ని అందించే ఈ హ్యాండ్‌బుక్‌లు ప్రభుత్వ విధానాల రూపకల్పన, అభివృద్ధి ప్రణాళికలు,సంక్షేమ కార్యక్రమాల అమలుకు కీలక ఆధారంగా నిలుస్తాయని పేర్కొన్నారు.జనగణన హ్యాండ్‌బుక్ రెండు భాగాలుగా ఉంటుందని తెలిపారు. పార్ట్--ఏలో గ్రామాలు,పట్టణాల మౌలిక సదుపాయాల వివరాలు,పార్ట్--బీలో జనగణన--2027 అనంతరం జనాభా గణాంకాలు పొందుపరుస్తారని వివరించారు.రెవెన్యూ గ్రామాలు,పట్టణాలకు సంబంధించిన వివరాలను 2025 డిసెంబర్ 31 నాటి సమాచారం ఆధారంగా నమోదు చేయాలని సూచించారు.జిల్లా జనగణన హ్యాండ్‌బుక్ తయారీ ప్రక్రియను రాష్ట్ర స్థాయిలో డైరెక్టర్ ఆఫ్ సెన్సస్ ఆపరేషన్స్ పర్యవేక్షిస్తారని తెలిపారు. జిల్లా కలెక్టర్లు సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుని సమాచార సేకరణ,జిల్లా ప్రొఫైల్, మోటిఫ్ రూపకల్పనను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు.తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు తదితర చార్జ్ అధికారులు ఫీల్డ్ సిబ్బంది సేకరించిన సమాచారాన్ని క్షుణ్ణంగా పరిశీలించి,ధృవీకరించిన తర్వాతే సమర్పించాలని సూచించారు.గ్రామీణ ప్రాంతాలకు విలేజ్ డైరెక్టరీ, పట్టణ ప్రాంతాలకు టౌన్ డైరెక్టరీ మాడ్యూళ్లను వినియోగించాలని తెలిపారు.విద్య,వైద్యం, వ్యవసాయం, పంచాయతీరాజ్,మిషన్ భగీరథ,రవాణా,బ్యాంకింగ్,పరిశ్రమలు తదితర శాఖల నుంచి సమగ్ర సమాచారాన్ని సేకరించి నమోదు చేయాలని ఆదేశించారు.గ్రామ,పట్టణ అధికారులు సంబంధిత శాఖలతో సమాచారాన్ని ధృవీకరించి,డీసీహెచ్‌బీ మొబైల్ యాప్/పోర్టల్‌లో ఎలాంటి పొరపాట్లు లేకుండా డిజిటల్ విధానంలో నమోదు చేయాలని సూచించారు.ఫీల్డ్ ఫంక్షనరీలు డేటా నమోదు అనంతరం సెక్షన్--9లో గ్రామాలు, పట్టణాల చారిత్రక,సాంస్కృతిక,పర్యాటక, ఆర్థిక విశిష్టతలు,ప్రముఖ ఆలయాలు, వారసత్వ కట్టడాలు తదితర ప్రత్యేకతలను నమోదు చేయాలని తెలిపారు.ఆగస్టు 10 నుంచి 21 వరకు సమాచార సేకరణ,ఆగస్టు 22 నుంచి సెప్టెంబర్ 8 వరకు డేటా ఎంట్రీ,క్రాస్ చెకింగ్,సెప్టెంబర్ 9 నుంచి అక్టోబర్ 8 వరకు డేటా వాలిడేషన్ పూర్తి చేయాలని సూచించారు.జిల్లా ప్రొఫైల్,మోటిఫ్‌ను సెప్టెంబర్ 8లోగా సమర్పించాలని ఆదేశించారు.అన్ని జిల్లాల అధికారులు ఖచ్చితమైన సమాచారాన్ని నిర్ణీత గడువులోగా సమర్పించి జిల్లా జనగణన హ్యాండ్‌బుక్--2027 తయారీని విజయవంతంగా పూర్తి చేయాలని భారతి హోళికేరి సూచించారు.వీడియో కాన్ఫరెన్స్‌లో ఐడీఓసీ నుంచి జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగరావు పాల్గొన్నారు.అనంతరం జిల్లా అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ,జనగణన హ్యాండ్‌బుక్--2027కు సంబంధించిన సమాచారాన్ని ఖచ్చితంగా సేకరించి గడువులోగా సమర్పించాలని ఆదేశించారు.సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుని పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు మనోజ్ కుమార్ రెడ్డి,రాజ్ కుమార్,సీపీఓ పాపయ్య,జిల్లా సంక్షేమ అధికారి సునంద, పరిశ్రమల శాఖ అధికారి రామ లింగేశ్వర్ గౌడ్,డీఎంహెచ్‌వో సంధ్య కిరణ్మయి,ఉద్యాన శాఖ అధికారి రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలి

## ఇరిగేషన్ ఎస్ఈ కేశవరావు



**గద్వాల ఆగస్టు 07(ప్రజా జ్యోతి ప్రతినిధి)**
:ఎల్‌నినో ప్రభావం,వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రానున్న రోజుల్లో వర్షపాతం తగ్గి నీటి కొరత ఏర్పడే అవకాశం ఉన్నందున రైతులు తక్కువ నీటితో సాగు చేయగల ప్రత్యామ్నాయ పంటలను ఎంచుకోవాలని ఇరిగేషన్ శాఖ సూపరింటెండింగ్ ఇంజనీర్ (ఎస్ఈ) కేశవరావు ఒక ప్రకటనలో సూచించారు.ప్రస్తుతం జూరాల ప్రాజెక్టుకు వరద నీరు రావడంతో చెరువులను నింపడం, తాగునీటి అవసరాల కోసం కాల్వల ద్వారా నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు. అయితే,ఈ నీటి విడుదల వరద ప్రవాహం కొనసాగినంత వరకు మాత్రమే ఉంటుందని, వరద తగ్గిన వెంటనే నిలిపివేయబడుతుందని స్పష్టం చేశారు.ప్రస్తుత పరిస్థితుల్లో వాతావరణ శాఖ అంచనాల ప్రకారం రానున్న రోజుల్లో వర్షాలు తగ్గే అవకాశం ఉందని, కొత్తగా వరదలు వచ్చే సూచనలు లేవని పేర్కొన్నారు.అందువల్ల ప్రస్తుతం కాల్వల ద్వారా విడుదల చేస్తున్న నీరు వ్యవసాయ అవసరాల కోసం కాదని రైతులు గుర్తించాలని సూచించారు.కాల్వల్లో నీరు వస్తోందనే కారణంతో పూర్తి పంటకాలం పాటు నీటి విడుదల కొనసాగుతుందని భావించి అధిక నీటి అవసరమయ్యే పంటలను సాగు చేయవద్దని హెచ్చరించారు.నీటి విడుదల పరిమిత కాలానికి మాత్రమే ఉంటుందని, వరద తగ్గిన వెంటనే నిలిపివేస్తామని రైతులు గమనించాలని కేశవరావు విజ్ఞప్తి చేశారు.

# ఆర్టీసీ డ్రైవర్లకు రోడ్డు భద్రతపై ట్రాఫిక్ పోలీసుల అవగాహన

**-ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తేనే ప్రమాదాల నివారణ**
**- 55 మంది డ్రైవర్లకు సూచనలు**

**మహబూబ్‌నగర్, ఆగస్టు 7 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**
జిల్లా ఎస్పీ దరావత్ జానకి ఆదేశాల మేరకు మహబూబ్‌నగర్ ట్రాఫిక్ పోలీసులు శుక్రవారం ఆర్టీసీ బస్ డిపోలో ఆర్టీసీ డ్రైవర్లకు రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.కార్యక్రమంలో ట్రాఫిక్ సిబ్బంది డ్రంక్ అండ్ డ్రైవ్, వాహనం నడుపుతూ సెల్‌ఫోన్ వినియోగం, అతివేగం వంటి ప్రమాదకర చర్యల వల్ల సంభవించే ప్రమాదాలను వివరించారు. వాహనం నడిపే సమయంలో ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, వేగాన్ని నియంత్రించుకోవాలని, డ్రైవింగ్ సమయంలో సెల్‌ఫోన్ వినియోగానికి పూర్తిగా దూరంగా ఉండాలని సూచించారు. ప్రయాణికుల భద్రతను అత్యంత ప్రాధాన్యంగా తీసుకుని అప్రమత్తంగా, బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని ఆర్టీసీ డ్రైవర్లకు సూచించారు. రోడ్డు భద్రతా నిబంధనలను కచ్చితంగా అమలు చేయడం ద్వారా రోడ్డు ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.ఈ అవగాహన కార్యక్రమంలో ఏఎస్ఐ అంజిలయ్య, పోలీస్ కానిస్టేబుల్ ఎల్. రమేష్ పాల్గొని డ్రైవర్లకు భద్రతా సూచనలు అందించారు. మొత్తం 55 మంది ఆర్టీసీ బస్ డ్రైవర్లు కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ట్రాఫిక్ పోలీసులు “ట్రాఫిక్ నిబంధనలు పాటిద్దాం -- ప్రమాదాలను నివారిద్దాం -- సురక్షిత ప్రయాణాన్ని కొనసాగిద్దాం” అంటూ ప్రజలకు పిలుపునిచ్చారు.



# జర్నలిస్టుల సమస్యలపై పోరాడే.. టిడబ్ల్యూజేఎఫ్

**- టీ డబ్ల్యూ జె ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాటికొండ కృష్ణ**
**-ఉమ్మడి జిల్లా సమీక్ష సమావేశం విజయవంతం**
**- అచ్చంపేట ఇంచార్జ్... జిల్లా ఉపాధ్యక్షుడు సయ్యద్ షఫి**

**నాగర్ కర్నూల్ ఆగస్టు 7 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)**
జర్నలిస్టుల పక్షాన ఏ ప్రభుత్వానికైనా.. అనుసంధానం లేకుండా కేవలం జర్నలిస్టుల సమస్యల పక్షాన పోరాడే యూనియన్ టి డబ్ల్యూ జే ఎఫ్ అని రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాటికొండ కృష్ణ స్పష్టం చేశారు. జర్నలిస్టుల సమస్యలపై నిరంతరాయంగా పోరాటాలు కొనసాగిస్తున్నామని ఆయన వ్యాఖ్యానించారు. జర్నలిస్టులకు సంక్షేమ పథకాల్లో లబ్ధి చేకూరే విధంగా రాష్ట్ర.. కేంద్ర ప్రభుత్వాలు కూడా జర్నలిస్టులకు చేయూతని ఇవ్వాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. జర్నలిస్టులు గొంతెమ్మ కోరికలు ఏవి కొరవడం లేదని.. వారికి రావాల్సిన హక్కులను మాత్రమే కోరుతున్నారని ఆయన వ్యాఖ్యానించారు. కాగా నల్లమల్ల ప్రాంతంలో జరిగిన ఉమ్మడి జిల్లా సమావేశానికి, అత్యధికంగా హాజరై, సమీక్ష సమావేశం విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలుపుతూ శు క్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అదేవిధంగా అచ్చంపేట నియోజకవర్గము ఇంచార్జ్ టిడబ్ల్యూజేఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు సయ్య షఫీ గురువారం జరిగిన సమావేశానికి హాజరై, విజయవంతం చేసినందుకు జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల నుంచి దాదాపుగా పత్రికల్లో పని చేసే 90 మంది జర్నలిస్టులు హాజరై.. సభను విజయవంతం చేసినందుకు ప్రతి ఒక్కరికి పేరుపేరునా హృదయపూర్వక ధన్యవాదాలు తెలుపుతున్నట్టు శుక్రవారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. అదేవిధంగా ఈ కార్యక్రమానికి పూర్తిగా సహాయ సహకారాలు అందించిన రాష్ట్ర ఉపాధ్యక్షులు తాటికొండ కృష్ణ కి అచ్చంపేట నియోజకవర్గం నుంచి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నాం. సమీక్ష సమావేశంలో ఉమ్మడి జిల్లాలనుంచి కాకుండా రాష్ట్ర స్థాయిలో టిడబ్ల్యూజేఎఫ్ నాయకులు, జర్నలిస్టులు తదితరులు పాల్గొన్నారు



# ప్లాస్టిక్ సామాన్లు అమ్ముతూ ఇళ్లలో చోరీలు

## ఒకరు అరెస్ట్, రూ.2.45 లక్షల బంగారం స్వాధీనం

**గద్వాల ఆగస్టు 07(ప్రజా జ్యోతి ప్రతినిధి):**
పోలీస్‌స్టేషన్ పరిధిలోని జమ్మిచేడు గ్రామంలో జరిగిన రెండు గృహ చోరీ కేసులను పోలీసులు ఛేదించారు.మహారాష్ట్ర రాష్ట్రంలోని ధారాశివ్ (ఉస్మానాబాద్) జిల్లాకు చెందిన రితిక్ షిండేను అరెస్ట్ చేయగా, మరో నిందితుడు గోయం పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.ప్లాస్టిక్ సామాన్లు విక్రయించే పేరుతో గద్వాల పరిసర గ్రామాల్లో సంచరిస్తూ ఇళ్లను రెక్కీ నిర్వహించి,రాత్రి వేళల్లో చోరీలకు పాల్పడినట్లు దర్యాప్తులో వెల్లడైంది.బాధితులు కెంపు ఎల్ల బుజ్జమ్మ, ప్రేమల హైరోజమ్మ ఇళ్లలో చోరీ చేసిన రూ.2.45 లక్షల విలువైన బంగారు ఆభరణాలతో పాటు ఒక పాకెట్ కత్తిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.ఘటన అనంతరం డాగ్ స్క్వాడ్,క్లూస్ టీమ్ సహాయంతో ఆధారాలు సేకరించిన పోలీసులు,సీసీటీవీ దృశ్యాలు, సాంకేతిక ఆధారాల విశ్లేషణ ద్వారా నిందితుడిని గుర్తించి అరెస్ట్ చేశారు.అనంతరం అతడిని మీడియా ముందు ప్రవేశపెట్టారు.ఈ వివరాలను గద్వాల సీఐ టంగుటూరి శ్రీనివాస్,రూరల్ ఎస్సై శ్రీకాంత్ విలేకరుల సమావేశంలో వెల్లడించారు.



# తెలంగాణ ఉద్యమ త్యాగాలకు గౌరవం దక్కాలి

## మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాన్ని టీజేఎస్ కు కేటాయించాలి

### - టీజేఎస్ రాష్ట్ర కమిటీ సభ్యులు,నియోజకవర్గ ఇన్చార్జి మొసలి శ్యాం ప్రసాద్ రెడ్డి

**నాగర్ కర్నూల్ ఆగస్టు 7 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)**

మహబూబ్‌నగర్--రంగారెడ్డి--హైదరాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాన్ని మహాకూటమి (పొత్తు)లో భాగంగా తెలంగాణ జన సమితి(టీజేఎస్) పార్టీకి కేటాయించాలని టీజేఎస్ రాష్ట్ర కమిటీ సభ్యులు,నియోజకవర్గ ఇన్‌చార్జ్ మొసలి శ్యాం ప్రసాద్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానాన్ని శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో తెలంగాణ జన సమితి పార్టీ కీలక పాత్ర పోషించిందని, ఉద్యమ లక్ష్యాల సాధన కోసం పార్టీనాయకులు,కార్యకర్తలు ఎన్నో త్యాగాలు చేశారని గుర్తు చేశారు. ఉద్యమ స్ఫూర్తిని నిలబెట్టుకుంటూ ప్రజా...సమస్యలు,నిరుద్యోగం,విద్య, పట్టభద్రుల హక్కుల కోసం టీజేఎస్ నిరంతరం ప్రజల పక్షాన పోరాటం చేస్తోందని తెలిపారు. తెలంగాణ ఉద్యమానికి మేధోబలంగా నిలిచిన ప్రొఫెసర్ కోదండరాం నాయకత్వానికి ప్రజల్లో విశేష ఆదరణ ఉందని పేర్కొన్నారు. అలాంటి నాయకత్వాన్ని మరింత బలోపేతం చేయాలంటే మహబూబ్‌నగర్--రంగారెడ్డి--హైదరాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాన్ని తెలంగాణ జన సమితికి కేటాయించడం సముచిత నిర్ణయమని అభిప్రాయపడ్డారు. టీజేఎస్‌కు ఎమ్మెల్సీ స్థానం కేటాయించడం ద్వారా తెలంగాణ ఉద్యమ ఆకాంక్షలకు గౌరవం లభించడమే కాకుండా,మహాకూటమి మరింత బలోపేతం అవుతుందని ఆయన అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం,రాష్ట్ర నాయకత్వం ఈ అంశాన్ని సానుకూలంగా పరిశీలించి,ప్రత్యేక తెలంగాణ కోసం పోరాడిన ఉద్యమ శక్తులకు న్యాయం చేసేలా మహబూబ్‌నగర్--రంగారెడ్డి--హైదరాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాన్ని తెలంగాణ జన సమితి పార్టీకి కేటాయించాలని రాష్ట్ర కమిటీ సభ్యులు,నాగర్ కర్నూల్ జన సమితి నియోజకవర్గ ఇన్చార్జి మొసలి శ్యాం ప్రసాద్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.



# ఘనంగా మెహందీ ఉత్సవం

**మల్దకల్,ఆగస్టు 7(ప్రజా జ్యోతి ప్రతినిధి):**



మల్దకల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం ప్రిన్సిపాల్ శ్రీలత రెడ్డి అధ్యక్షతన మెహందీ ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యాపకులు,విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థినులు ఇంటి వద్ద సహజసిద్ధంగా తయారు చేసిన గోరింటాకుతో తమ చేతులను అందంగా అలంకరించుకుని ఆటపాటలతో సందడి చేశారు. కళాశాల ప్రాంగణం పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ శ్రీలత రెడ్డి మాట్లాడుతూ, ఆషాఢ మాసంలో గోరింటాకు వేడుకలకు ప్రత్యేక ప్రాధాన్యం ఉంటుందని తెలిపారు. అమ్మాయిలు గోరింటాకుతో చేతులను అలంకరించుకుని కుటుంబ సభ్యులు, బంధువులు,స్నేహితులతో ఆనందాన్ని పంచుకుంటారని చెప్పారు. తెలంగాణలో ఇదే సమయంలో బోనాల పండుగను కూడా అత్యంత భక్తి శ్రద్ధలతో,ఉత్సాహంగా జరుపుకుంటారని పేర్కొన్నారు. సంప్రదాయాలు,సంస్కృతిని విద్యార్థులు పరిరక్షించి భావితరాలకు అందించాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు భాగ్యలక్ష్మి, మాధురి,రామాంజనేయులు గౌడ్,నరసింహులు,గోవర్ధన్ శెట్టి,శ్రీకాంత్, రంగస్వామి,ఇష్తికర్ అహ్మద్‌తో పాటు అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

# ఆరోగ్యశ్రీ సాధన వెనుక మందకృష్ణ పోరాటం

## - ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో వనపర్తిలో ఆరోగ్యశ్రీ సాధన దినోత్సవం

**వనపర్తి, ఆగస్టు 7 (ప్రజాజ్యోతి):**

ఆరోగ్యశ్రీ సాధన దినోత్సవాన్ని పురస్కరించుకుని వనపర్తి జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌక్‌లో శుక్రవారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి ఆరోగ్యశ్రీ పథకం సాధన వెనుక జరిగిన ఉద్యమాన్ని నాయకులు స్మరించుకున్నారు. ఎమ్మార్పీఎస్--ఎంఎస్‌పీ జిల్లా ఇంచార్జి కొమ్మువారి మస్తాన్ మాదిగ మాట్లాడుతూ.. పేద చిన్నారులకు గుండెజబ్బుల ఉచిత చికిత్స అందించాలనే లక్ష్యంతో పద్మశ్రీ మందకృష్ణ మాదిగ చేపట్టిన ఉద్యమం సామాజిక ఆరోగ్య చరిత్రలో కీలక మలుపుగా నిలిచిందన్నారు. 2004లో ఖమ్మం జిల్లా మధిరకు చెందిన నసీమ అనే చిన్నారికి గుండె శస్త్రచికిత్స కోసం ప్రభుత్వం పూర్తి ఆర్థిక సహాయం అందించకపోవడంతో ఉద్యమం ప్రారంభమైందని తెలిపారు. హైదరాబాద్‌లో ర్యాలీలు, నిరసనలు, సచివాలయం ముట్టడి వంటి కార్యక్రమాల ద్వారా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడంతో రాష్ట్రవ్యాప్తంగా గుండెజబ్బుల నిర్ధారణ శిబిరాలు నిర్వహించి వేలాది మంది చిన్నారులకు కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఉచిత శస్త్రచికిత్సలు చేయించినట్లు చెప్పారు. అదే ఉద్యమం రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకానికి పునాదిగా నిలిచిందని,



అనంతరం ఆయుష్మాన్ భారత్ వంటి జాతీయ వైద్య సంక్షేమ పథకాల ఆవిర్భావానికి స్ఫూర్తిగా మారిందన్నారు. పేదల ఆరోగ్య హక్కు కోసం జీవితాన్ని అంకితం చేసిన పద్మశ్రీ మందకృష్ణ మాదిగ సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. కార్యక్రమంలో కొమ్ము చెన్నకేశవులు మాదిగ, మీసాల నాగరాజు మాదిగ, గంధం గట్టయ్య మాదిగ, కేశపాగ కేశవులు మాదిగ, గంధం నాగరాజు మాదిగ, గోవింద్ మాదిగ, బోజరాజు, ద్వారపోగు వెంకటేష్, విశ్వంబాబు, మొలకలపల్లి పరుషరాముడు మాదిగ, మచ్చ తిరుపతి మాదిగ, కృష్ణ, బెంజిమెన్, గంధం కృష్ణయ్య, కుశ్‌కుమార్, గంధం లక్ష్మయ్య, వంగాలి నాగరాజు మాదిగ, కొమ్ము గోపాల్ మాదిగ, పుట్టపగ అజయ్ మాదిగ, శ్రీకాంత్, నాగరాజు, కమ్యూనిస్టు నాయకుడు కురుమయ్య తదితరులు పాల్గొన్నారు.

# న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలి

## -నల్ల బ్యాడ్జీలతో ఉపాధి హామీ ఉద్యోగుల నిరసన

**నాగర్ కర్నూల్ : ఆగస్ట్ 07 (ప్రజా జ్యోతి)**



న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని ఉపాధి హామీ పథకంఉద్యోగులు శుక్రవారం ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన చేపట్టారు. నిరసన ఏడో రోజుకు చేరిన సందర్భంగా శుక్రవారం ధర్నాలో వివిధ మండలాల ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని, తక్షణమే పేస్కేలు ప్రకటించాలని రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించాలని పే స్కేలు అమలు చేసే వరకు పోరాటం కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా జేఏసీ చైర్మన్ బాలయ్య,కంప్యూటర్ ఆపరేటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మహమ్మద్ ఇసాక్,అడిషనల్ ప్రోగ్రాం అధికారిలు రాజేశ్వరి, చంద్ర సిద్ధార్థ,సత్య నారాయణ,సాంకేతిక సహాయకులు రాజేష్,జీవన్ ప్రకాష్,మల్లి కార్జున్,మహమ్మద్ రఫీక్,భాగ్యలక్ష్మి,మంజుల,లక్ష్మి పాల్గొన్నారు.

# "అందరి దేవుడు ఒక్కడే... మనుషులంతా ఒక్కటే" నినాదంతో 'సబ్కా మాలిక్' సేవా సంఘం ప్రారంభం

**మహబూబ్‌నగర్, ఆగస్టు 7 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**

సమాజంలో కుల, మత, వర్గ, ధనిక-పేద అనే భేదాలకు అతీతంగా మానవత్వమే పరమోన్నత విలువ అనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు 'సబ్కా మాలిక్ ఏక్' అనే సేవా సంఘాన్ని ఏర్పాటు చేసినట్లు ఆ సంస్థ వ్యవస్థాపకుడు సబ్ కా సురేందర్ తెలిపారు. శుక్రవారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, "అందరి దేవుడు ఒక్కడే -- మనుషులంతా ఒక్కటే" అనే సిద్ధాంతంతో ఈ సంఘం కార్యకలాపాలు కొనసాగుతాయని చెప్పారు. భూమిపై ఉన్న ప్రతి మనిషి సమానమేనని, కులాలు, మతాలు, వర్గాలు, ఆర్థిక స్థితి ఆధారంగా ఎలాంటి భేదభావాలకు తావులేకుండా సమానత్వ భావనతో సమాజ నిర్మాణమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా సేవా కార్యక్రమాలు చేపట్టి మానవత్వాన్ని పెంపొందించే కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. "కోటి విద్యలు కూటి కొరకే" అనే నానుడిని ప్రస్తావిస్తూ, జీవనోపాధి కోసం చేసే వృత్తుల ఆధారంగానే కుల వ్యవస్థ ఏర్పడిందని, కానీ నేటి సమాజంలో అందరూ సమానులనే భావనతో ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు. కులమతాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ పరస్పర గౌరవం, సోదరభావంతో జీవించాలని, సమాజంలో ఐక్యత, సామరస్యాన్ని పెంపొందించడమే 'సబ్కా మాలిక్' సంఘం ప్రధాన లక్ష్యమని డాక్టర్ సురేందర్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సంఘం అధ్యక్షుడు ఎండి సబ్జాద్, ఉపాధ్యక్షుడు సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.




# క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ ఆన్‌లైన్ అమలుపై వైద్యాధికారులకు పునఃశ్చరణ శిక్షణ

**మహబూబ్‌నగర్, ఆగస్టు 7 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**

క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్‌ను పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో సమర్థవంతంగా అమలు చేయడంపై మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో శుక్రవారం ఒకరోజు పునఃశ్చరణ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మహబూబ్‌నగర్, నారాయణపేట్, నాగర్‌కర్నూల్ జిల్లాల జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారులు, ప్రోగ్రామ్ అధికారులు, మాస్ మీడియా అధికారులకు నిర్వహించిన ఈ శిక్షణకు క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ జాయింట్ డైరెక్టర్ డా. రమణ అధ్యక్షత వహించారు. యాక్ట్‌ను పూర్తిస్థాయిలో డిజిటల్ విధానంలో అమలు చేసే ప్రక్రియ, ఆన్‌లైన్ నమోదు, నిర్వహణ, పర్యవేక్షణ తదితర అంశాలపై అధికారులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మహబూబ్‌నగర్, నారాయణపేట్, నాగర్‌కర్నూల్ జిల్లాల డీఎంహెచ్‌వోలు డా. ఎ. శ్రీనివాసులు, డా. కృష్ణ, డా. జయచంద్రమోహన్, డా. శివకాంత్, రాజగోపాల్ చారి, డిప్యూటీ డీఎంఈఓ సునీల్, హెల్త్ ఎడ్యుకేటర్లు నాగరాజు, హన్మంతు, నర్సింహా, శ్రీనివాసులు, డీడీఎంలు మహేష్, సందీప్‌తో పాటు సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు. అధికారులు యాక్ట్ అమలులో ఎదురయ్యే సందేహాలను నివృత్తి చేసుకుంటూ, ఆన్‌లైన్ విధానాన్ని క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని నిర్ణయించారు.



# జనగణన-2027 వివరాల సేకరణను గడువులోగా పూర్తి చేయాలి

## : రాష్ట్ర జనగణన సంచాలకులు భారతి హోళ్లికేరి

**మహబూబ్‌నగర్, ఆగస్టు 7 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**
జనగణన --2027లో భాగంగా జిల్లా జనగణన హ్యాండ్‌బుక్ తయారీకి అవసరమైన గ్రామ, పట్టణ డైరెక్టరీ వివరాల సేకరణను పూర్తి ఖచ్చితత్వంతో, నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా నిర్ణీత గడువులో పూర్తి చేయాలని రాష్ట్ర జనగణన సంచాలకులు భారతి హోళ్లికేరి అధికారులను ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, సంబంధిత అధికారులతో జనగణన--2027 పనుల పురోగతిని ఆమె సమీక్షించారు. గ్రామాలు, పట్టణాలకు సంబంధించిన విద్య, వైద్యం, తాగునీరు, పారిశుధ్యం, విద్యుత్, రహదారులు, రవాణా, బ్యాంకింగ్, పోస్టల్, వ్యవసాయం, మార్కెటింగ్ తదితర సామాజిక, ఆర్థిక, మౌలిక వసతుల వివరాలను క్షేత్రస్థాయిలో సేకరించి వెబ్ పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. ఫీల్డ్ సిబ్బందికి అవసరమైన శిక్షణతో పాటు సాంకేతిక సహకారం అందించాలని, సంబంధిత శాఖల రికార్డులతో వివరాలను ధృవీకరించిన అనంతరం మాత్రమే నమోదు చేయాలని ఆమె స్పష్టం చేశారు. డేటా భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, అధికారిక యాప్, వెబ్ పోర్టల్‌ను మాత్రమే వినియోగించాలని, యూజర్ ఐడీలు, పాస్‌వర్డ్‌లను గోప్యంగా ఉంచాలని సూచించారు. మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ, ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ సాయి శివాని, జిల్లా ముఖ్య ప్రణాళిక



అధికారి నర్సింహులు సమావేశంలో పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా అధికారులతో సమావేశమైన కలెక్టర్ ఖుష్బూ గుప్తా మాట్లాడుతూ, జిల్లా జనగణన హ్యాండ్‌బుక్ భవిష్యత్ అభివృద్ధి ప్రణాళికలు, సంక్షేమ కార్యక్రమాల రూపకల్పన, మౌలిక వసతుల కల్పనకు కీలకమైన ప్రామాణిక సమాచార వనరుగా ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాలకు సంబంధించిన వివరాల సేకరణ, నమోదు ప్రక్రియను నిర్దేశిత గడువులోగా నాణ్యతతో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గోవింద్ నాయక్, ఆర్అండ్‌బీ ఈఈ దేశ్యా నాయక్, జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారి జరీనా బేగం, ఎల్‌డీఎం చంద్రశేఖర్‌తో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# 'ఫ్రైడే--డ్రైడే' తనిఖీలో డీఎంహెచ్‌వో..

## పరిసరాల పరిశుభ్రతతోనే దోమల వ్యాధుల నివారణ

**మహబూబ్‌నగర్, ఆగస్టు 7 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**
దోమల ద్వారా వ్యాపించే వ్యాధులను నివారించాలంటే ప్రతి ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం అత్యంత అవసరమని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డా. ఎ. శ్రీనివాసులు పేర్కొన్నారు. శుక్రవారం "ఫ్రైడే--డ్రైడే" కార్యక్రమంలో భాగంగా దొడ్డోలోనిపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న కార్యక్రమాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామంలో పర్యటించిన డీఎంహెచ్‌వో ఇంటి పరిసరాలు, మురుగు నిల్వలు, పరిశుభ్రత పరిస్థితులను పరిశీలించారు. ప్రజలకు దోమల నివారణ చర్యలపై విస్తృత అవగాహన కల్పించాలని ఆరోగ్య సిబ్బందిని ఆదేశించారు. ప్రతి శుక్రవారం డ్రైడే కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహిస్తూ, నీరు నిల్వ ఉండే ప్రదేశాలను గుర్తించి శుభ్రం చేయాలని సూచించారు. అదేవిధంగా, ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు --2026 సందర్భంగా ఆగస్టు 1 నుంచి 7 వరకు నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో భాగంగా గ్రామంలోని గర్భిణులు, బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. నవజాత శిశువు ఆరోగ్యవంతమైన ఎదుగుదలకు తల్లిపాలే సంపూర్ణ పోషకాహారమని డా. శ్రీనివాసులు తెలిపారు. శిశువు జన్మించిన తొలి గంటలోనే తల్లిపాలను



ప్రారంభించడం వల్ల వ్యాధి నిరోధక శక్తి పెరిగి అనేక అంటువ్యాధుల నుంచి రక్షణ లభిస్తుందని చెప్పారు. పుట్టిన తొలి ఆరు నెలల వరకు శిశువుకు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని, అనంతరం వయస్సుకు తగిన అదనపు ఆహారంతో పాటు రెండేళ్ల వరకు లేదా అంతకంటే ఎక్కువ కాలం తల్లిపాలను కొనసాగించాలని సూచించారు. తల్లి, శిశు ఆరోగ్య సంరక్షణలో తల్లిపాల పాత్ర అత్యంత కీలకమని పేర్కొంటూ ప్రతి కుటుంబం ఈ అంశంపై అవగాహన కలిగి ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డా. నరేష్ చంద్ర, సుభాష్ చంద్ర, అశోక్ రాజు, చక్రపాణి, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# టీబీ రహిత భారతమే లక్ష్యం

## కేజీబీవీ లో అవగాహన సదస్సు.

### డాక్టర్ రాజశేఖర్

**వీపనగండ్ల ప్రజా జ్యోతి రిపోర్టర్**
మండల పరిధిలోని కేజీబీవీ పాఠశాలలో టీబీ ముక్త్ భారత్ కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం రోజు వైద్యాధికారి డాక్టర్ రాజశేఖర్ ఆధ్వర్యంలో టిబి వ్యాధిపై విస్తృత అవగాహన కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా టిబి వ్యాధి లక్షణాలు వ్యాధి వ్యాప్తి చెంది మార్గాలు ముందస్తు నిర్ధారణ ప్రాముఖ్యత ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచిత వైద్య సేవలు పూర్తిస్థాయిలో మందులు వాడాల్సిన అవసరం వంటి అంశాలను విద్యార్థులకు సిబ్బందికి వివరించారు టిబి వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించి సకాలంలో చికిత్స పొందుతే పూర్తి నయం చేయవచ్చని ప్రతి ఒక్కరు టీబీ నిర్మూలనకు భాగ్యస్వాములు కావాలని డాక్టర్ రాజశేఖర్ పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసరావు గ్రామ సర్పంచ్ మీసాల పార్వతమ్మ ఎస్ ఓ అరుణ ఉపాధ్యాయులు ఏఎన్ఎంలు రామచంద్రమ్మ భారతి హెల్త్ అసిస్టెంట్ జహంగీర్ ఆశ వర్కర్లు పాల్గొన్నారు



# నామినేటెడ్ పదవుల్లో అవకాశం కల్పించండి

## – డీసీసీ అధ్యక్షుడికి జిల్లా ప్రధాన కార్యదర్శి.మహమ్మద్ సలీం వినతి.

**నారాయణపేట ప్రతినిధి ఆగస్టు 07 (ప్రజా జ్యోతి)**
రాష్ట్ర ప్రభుత్వం త్వరలో నామినేటెడ్ పద్ధతిలో భర్తీ చేయనున్న నారాయణపేట గ్రాజూ అధ్యక్ష పదవికి తన పేరును కాంగ్రెస్ పార్టీ అధిష్టానానికి సిఫార్సు చేయాలని కోరుతూ శు



క్రవారం జిల్లా కేంద్రంలోని సీవీఆర్ భవన్‌లో డీసీసీ అధ్యక్షులు శ్రీ కె.ప్రశాంత్ కుమార్ రెడ్డికి జిల్లా కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ సలీం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మహమ్మద్ సలీం మాట్లాడుతూ,గత పదేళ్లకు పైగా కాంగ్రెస్ పార్టీకి అంకితభావంతో సేవలందిస్తున్నానని తెలిపారు. పార్టీ కష్టకాలమైన 2017 నుంచి 2023 వరకు ప్రతిపక్షంలో ఉన్న సమయంలో నారాయణపేట పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడిగా పార్టీ కార్యక్రమాలు, ఆందోళనలు,సభ్యత్వ నమోదు,ప్రజా సమస్యలపై పోరాటాల్లో చురుకుగా పాల్గొన్నానని పేర్కొన్నారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసిన మాజీ మండల,పట్టణ అధ్యక్షులు మరియు సీనియర్ నాయకులకు నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యత కల్పిస్తామని ఏఐసీసీ తెలంగాణ ఇన్‌చార్జి శ్రీమతి మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షులు మహేష్ గౌడ్ లు ప్రకటించారని గుర్తు చేశారు

# ఉల్లాస్--నవ భారత్ సాక్షరత కార్యక్రమాన్ని సమన్వయంతో విజయవంతం చేయాలి

## అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్



**మహబూబ్‌నగర్, ఆగస్టు 7 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**
జిల్లాలో ఉల్లాస్--నవ భారత్ సాక్షరత కార్యక్రమాన్ని అన్ని శాఖల సమన్వయంతో సమర్థవంతంగా అమలు చేసి ప్రతి నిరక్షరాస్యుడిని అక్షరాస్యుడిగా తీర్చిదిద్దాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని తన ఛాంబర్‌లో ఉల్లాస్--నవ భారత్ సాక్షరత కార్యక్రమంపై నిర్వహించిన కన్వర్జెన్స్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికే ఉల్లాస్ పోర్టల్‌లో గుర్తించిన నిరక్షరాస్యులకు, గుర్తింపు పొందిన అక్షరాస్య వాలంటీర్ల ద్వారా విద్యాబోధన అందించి వారిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని సూచించారు. జిల్లాలో స్వయం సహాయక సంఘాల పరిధిలో గుర్తించిన సుమారు 41 వేల మంది నిరక్షరాస్య మహిళలు, మెప్మా పరిధిలో ఉన్న మరో 10 వేల మంది నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా మార్చేందుకు అన్ని శాఖలు సమన్వయంతో కృషి చేయాలని ఆదేశించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పంచాయతీ కార్యదర్శులు, ఎంపీడీవోలు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, మున్సిపల్ కమిషనర్లు, మెప్మా రిసోర్స్ పర్సన్లు కార్యక్రమాన్ని నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. అలాగే, టాస్ కార్యక్రమంలో అభ్యాసకులను పరీక్షలకు సన్నద్ధం చేసి ఉత్తీర్ణత సాధించేలా ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. జిల్లాలో ఒక్క నిరక్షరాస్యుడు కూడా మిగలకుండా చేయడమే ప్రభుత్వ లక్ష్యమని, ఇందుకోసం ప్రతి శాఖ బాధ్యతాయుతంగా పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అదనపు కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా పరిషత్ సీఈఓ వెంకటరెడ్డి, వయోజన విద్యా శాఖ ఉప సంచాలకులు శ్రీనివాస్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

# గుణాత్మక విద్యకు ప్రధానోపాధ్యాయులే వెన్నెముక

## విద్యాశాఖ ఆర్జేడీ సోమిరెడ్డి

**మహబూబ్‌నగర్, ఆగస్టు 7 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**
ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు గుణాత్మకమైన విద్యను అందించడంలో ప్రధానోపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని తెలంగాణ విద్యాశాఖ ఆర్జేడీ సోమిరెడ్డి పేర్కొన్నారు. స్థానిక మోడల్ బేసిక్ పాఠశాలలో ప్రధానోపాధ్యాయులకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాన్ని ఆయన శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేసి, శిక్షణ పొందుతున్న హెచ్ఎంలతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పాఠశాలల్లో విద్యార్థుల డ్రాపౌట్లను పూర్తిగా నివారించి, బడి ఈడు పిల్లలందరినీ పాఠశాలల్లో చేర్పించేలా ప్రవేశాల నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని సూచించారు. ప్రతి పాఠశాలలో మౌలిక వసతులను మెరుగుపరచడంతో పాటు అన్ని రికార్డులను పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు.

విద్యార్థుల సంఖ్యను పెంచడమే కాకుండా విద్యా ప్రమాణాల పెంపుపై ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన అన్నారు. పిల్లలకు ఆనందదాయకమైన, సానుకూల వాతావరణంలో బోధన అందించినప్పుడే వారు మెరుగైన విద్యా ఫలితాలు సాధించి తమ లక్ష్యాలను చేరుకుంటారని ఆర్జేడీ సోమిరెడ్డి పేర్కొన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో ఏఎంఓ దుంకుడు శ్రీనివాస్, కోర్సు డైరెక్టర్ ఎం.ఏ. భాసిత్, ప్రధానోపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.



# గిరిజన హక్కులు పరిరక్షణ ప్రాముఖ్యత సమస్యలపై అవగాహన సదస్సు

### – అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కే. అవినాష్..

**నారాయణపేట ప్రతినిధి ఆగస్టు 07 (ప్రజా జ్యోతి)**

నారాయణపేట జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ డి.ఎల్.ఎస్.ఏ సెక్రటరీ కం సీనియర్ సివిల్ జడ్జి వింధ్య నాయక్ ఆదేశాల మేరకు నారాయణపేట జిల్లామక్తల్ మండలంలోని లింగంపల్లి గ్రామంలో ప్రపంచ ఆదివాసీ ప్రజల అంతర్జాతీయ దినోత్సవం సందర్భంగా , గిరిజన ప్రాబల్య ప్రాంతాలలోని గిరిజన ప్రజల ప్రయోజనం కోసం , మేము నల్సా ( గిరిజన హక్కుల పరిరక్షణ మరియు అమలు ) పథకం , 2015 పై ఒక ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కే. అవినాష్ అధ్యక్షత వహించారు. న్యామూర్తి గారు మాట్లాడుతూ ..గిరిజన సంక్షేమాన్ని ప్రోత్సహించడంలో డిఎల్ఎస్ఏ (ఋూూ ) పాత్ర ఏమిటి:

ప్రజల సంక్షేమం కోసం అనేక చట్టాలు, పథకాలు ఉన్నాయి. వాటి గురించి ప్రతి పౌరుడికి, ముఖ్యంగా గిరిజన, వెనుకబడిన ప్రాంతాల ప్రజలకు పూర్తి అవగాహన ఉండాలి. చట్టాల గురించి తెలియకపోవడం వల్ల చాలామంది తమకు రావాల్సిన హక్కులు, సౌకర్యాలు పొందలేకపోతున్నారు అని అన్నారు. గిరిజనుల ప్రయోజనాల కోసం కేంద్ర న్యాయ సేవా అధికార సంస్థ నల్సా ద్వారా అనేక పథకాలు అమలవుతున్నాయని తెలిపారు. వీటితో పాటు వృద్ధుల పథకాలు, రైతు సంక్షేమ పథకాలు, కట్న నిషేధ చట్టం, చైల్డ్ ఫ్రెండ్లీ లీగల్ సర్వీసెస్ గురించి కూడా గ్రామస్తులకు వివరించారు. వరికైనా చట్టపరమైన సమస్యలు ఉంటే భయపడకుండా జిల్లా న్యాయ సేవా అధికార సంస్థను సంప్రదించాలని సూచించారు. పేదలు, గిరిజనులు, మహిళలు, దివ్యాంగులకు పూర్తిగా ఉచితంగా న్యాయ సహాయం అందిస్తామని చెప్పారు. గిరిజన హక్కుల పరిరక్షణ ప్రాముఖ్యత



రాజ్యాంగలో అందరికి ప్రధాన హక్కులు : మానవ హక్కులు, పౌర హక్కులు, వినియోగదారుల హక్కులు, స్త్రీ హక్కులు, బాలల హక్కులు, వైకల్యం హక్కులు, స్వేచ్ఛ హక్కు, సమాచార హక్కులు, సీనియర్ సిటిజన్ హక్కులు, ట్రాఫికింగ్ హక్కులు, మహిళా హింస, మానవ హక్కులూ సమాన అవకాశాలు కల్పించిందన్ని అన్నారు.

న్యాయవాదులు మాట్లాడుతూ..

ప్రజలు చట్టాలపై అవగాహన కలిగి ఉన్నప్పుడే ప్రజలందరు తమ హక్కులను నిర్భయంగా పొందుతారని తెలిపారు. ప్రజలందరు సమానమే ఉన్నవాళ్లు, పేదవాళ్ళు అని తేడా లేదు, పేదరిక నిర్మూలనా, భూమి తాగదాలు,ఆస్తి తాగదాలు, సంక్షేమ పథకాలు, సామాజిక భద్రతా మరియు వివిధ ప్రభుత్వ పథకాలు, అక్షరాస్యత మరియు చట్టపరమైన అవగాహన మరియు ముఖ్యంగా, సమాజంలోని బలహీన వర్గాలకు హక్కులు, బాల్యవివాహాలు, బాలకార్మిక చట్టాలు, తమ పిల్లలకు చిన్న వయస్సులో పెళ్లిళ్ల చేస్తే పెద్దవారిదే తప్పుగా తల్లితండ్రుల నిర్వహణ ఆడది అభాల కాదు ఆదిశక్తి, స్త్రీ మరియు పురుష ఆధిక్యత, వరకట్న వేదింపులు, సఖి సెంటర్, వోల్డీగే హోమ్, గవర్నమెంట్ నుంచి వచ్చే బెనిఫిట్స్, వృద్ధుల సమస్యలు ఆర్థిక సమస్యలు, ఉపాధి నష్టం, రైతు చట్టాలు విత్తనాల చట్టం, ఎరువులు పురుగుల మందు చట్టం, వినియోగ దారుల రక్షణ చట్టం, నిత్యావసరాలు సరుకుల చట్టం, దీనికి సంబంధించే డీలర్ గానీ ఇతరులు గానీ బండికి సంబంధించిన లైసెన్స్ ను కలిగి వుండాలి. లేదంటే చట్టం వారిని శిక్షిస్తుంది. ఆదాయ లోపం మరియు ఆర్థిక అభద్రత వంటి సమస్యలు పెద్దల వేధింపుల సమస్యలు మొదలైన వాటికి సంబంధించిన సమస్యలను వృద్ధులు గౌరవంగా మరియు భద్రతతో జీవించగలగాలి మరియు దోపిడీ మరియు మానసిక మరియు శారీరక వేధింపులకు ప్రయోజనాలపై అవగాహన మరియు న్యాయపరమైన రక్షణ, చట్టపరమైన అవగాహన, మహిళలు, ఎస్సీ, ఎస్టీ, మూడు లక్షల లోపు సంవత్సరాల ఆదాయం కలిగిన బీసీలకు ఉచిత న్యాయ సేవలు అందుతాయన్నారు. ఆయా చట్టాలు హక్కుల పట్ల కార్మికులు పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలని సూచించారు. (14 సంแరాల) లోపు బాల-బాలికలకు ఉచితంగా విద్యను అందించాలి, మైనర్ (18 సంแరాలలోపు బాల బాలికనులు ఏ వాహనాలు నడుపకూడదు అలా నడిపిస్తే పిల్లలకు కాకుండా ఆ బండి యజమానికి శిక్ష పడుతుంది అన్నారు. పేద ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి తెలియజేయడం మరియు వారు ఆ పథకాలను సద్వినియోగం చేసుకునేలా ప్రోత్సహించడం. పథకాలకు దరఖాస్తు చేసుకోవడంలో ఎదురయ్యే సమస్యలను పరిష్కరించడానికి ఉచిత న్యాయ సహాయాన్ని అందించడం. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా చూడటం మరియు మధ్యవర్తుల ప్రమేయం లేకుండా చేయడం గురించి తెలిపారు. మీకు ఎలాంటి అనుమానాస్పద కార్యకలాపాలు కనిపిస్తే ప్రతి మహిళా మరియు సీనియర్ సిటిజన్స్ తో ఉండవలసిన హెల్ప్‌లైన్ నంబర్లు: 1098 - చైల్డ్ హెల్ప్‌లైన్ (24ఇ7), 181 - మహిళా హెల్ప్‌లైన్, 15100 - ఛీూూూ ఉచిత న్యాయ సహాయం, 112 - అత్యవసర సేవ టోల్-ఫ్రీ నంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రమేష్ కుమార్, పంచాయతి సెక్రటరీ నిర్మల మరియు సీనియర్ న్యాయవాదులు దత్తాత్రేయ, ఆడేం శ్రీనివాసులు, సూర్య ప్రకాష్, నరేదర్ సాగర్, క్రాంతి కుమార్ మరియు పోలీస్ అధికారులు ఎస్ఐ రేవతి, సర్పంచ్ వెంకట్ రాములు గౌడ్ పాల్గొన్నారు.

# పశు వైద్య సేవల్లో నిర్దేశిత లక్ష్యాలు తప్పనిసరిగా పూర్తి చేయాలి

### కలెక్టర్ ఖుష్బూ గుప్తా

**మహబూబ్‌నగర్, ఆగస్టు 7 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**

జిల్లాలో పశుసంవర్ధక శాఖ అమలు చేస్తున్న అన్ని పశు వైద్య కార్యక్రమాలు, పశు సంరక్షణ సేవల లక్ష్యాలను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా పశువైద్య అధికారులను ఆదేశించారు.

శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా పశుసంవర్ధక శాఖ త్రైమాసిక సమీక్ష సమావేశంలో ఆమె మండలాల వారీగా కృత్రిమ గర్భధారణ, వ్యాక్సినేషన్, డీ-వార్మింగ్, పశువుల కాస్ట్రేషన్, గడ్డి విత్తనాల పంపిణీ తదితర కార్యక్రమాల పురోగతిని సమీక్షించారు. కొన్ని మండలాల్లో లక్ష్యాల సాధన ఆశించిన స్థాయిలో లేదని గుర్తించిన కలెక్టర్, అందుకు గల కారణాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. రానున్న రెండు నుంచి మూడు నెలల్లో అన్ని కార్యక్రమాలను వంద శాతం పూర్తి చేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. పశువైద్య ఆసుపత్రులు, ఉపకేంద్రాల్లో విధులు నిర్వహిస్తున్న వైద్యులు, గోపాలమిత్రలు, పారా వెటర్నరీ సిబ్బంది రైతులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని, విధి నిర్వహణలో నిర్లక్ష్యానికి తావు లేకుండా పనిచేయాలని సూచించారు. ప్రతి కేంద్రంలో హాజరు నమోదు తప్పనిసరిగా నిర్వహించాలని, అనుమతి లేని డిప్యూటేషన్లకు అవకాశం లేదని స్పష్టం చేశారు.

పశువుల వ్యాక్సినేషన్, కృత్రిమ గర్భధారణ, డీ-వార్మింగ్ వంటి సేవలపై రైతులకు విస్తృత అవగాహన కల్పించి, సంప్రదాయ పద్ధతుల కంటే శాస్త్రీయ పశు వైద్య సేవలను ప్రోత్సహించాలని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రస్తుతం జిల్లాలో కురుస్తున్న వర్షాలను దృష్టిలో ఉంచుకుని 75 శాతం సబ్సిడీతో అందుబాటులో ఉన్న గడ్డి విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో పశువైద్య అధికారులు జిల్లాలోని పలు పశువైద్య కేంద్రాల భవనాలు శిథిలావస్థలో ఉన్నాయని, కొన్ని ఉప పశు వైద్యశాలల్లో కిటికీలు, మందుల భద్రత కోసం రిఫ్రిజిరేటర్లు, మహిళా వైద్య అధికారులకు మరుగుదొడ్లు, మూత్రశాలలు లేవని కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై స్పందించిన కలెక్టర్, పశువైద్యశాలల మరమ్మత్తులకు వెంటనే ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు. ప్రాథమిక పశువైద్యశాలలకు త్వరలోనే రిఫ్రిజిరేటర్లు అందిస్తామని, అన్ని కేంద్రాల్లో మరుగుదొడ్లు, మూత్రశాలల నిర్మాణానికి అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని జిల్లా పశువైద్య శాఖ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా వెటర్నరీ వైద్య అధికారి డా. జి. శివేంద్రస్వామి, సహాయ సంచాలకులు డా. బాలాజీ, మండల పశువైద్య అధికారులు, గోపాలమిత్రలు, పారా వెటర్నరీ సిబ్బంది పాల్గొన్నారు.



## ఐజ లో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభించిన మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్

### -వందల మందికి కంటి పరీక్షలు

**అలంపూర్ డివిజన్ (ప్రజా జ్యోతి) ఆగస్టు 07:**

ఐజ మండల కేంద్రంలో కందూరు రామ్ రెడ్డి లయన్స్ క్లబ్ లోఉచిత కంటి వైద్య శిబిరం తొలి రోజు విజయవంతంగా ప్రారంభమైంది.ఈ కార్యక్రమానికి అలంపూర్ మాజీ ఎమ్మెల్యే ఏఐసీసీ కార్యదర్శి డాక్టర్ ఎస్.ఏ.సంపత్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు.ఐజ పట్టణలో అనేకులు కంటి సమస్యలతో బాధపడుతున్న వారిని శిబిరానికి తీసుకువచ్చి వారికి ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించేలా ఏర్పాట్లు చేశారు. అవసరమైన వారికి శస్త్రచికిత్సల కోసం వైద్యుల సూచనలు మేరకు శస్త్రచికిత్స అవసరమైన రోగులకు రక్తపరీక్షలు,గుండె పరీక్షలు,షుగర్ పరీక్షలు నిర్వహించేందుకు స్థానిక ఎమ్మార్వో జ్యోతి ప్రభుత్వ ఆసుపత్రి అధికారులతో మాట్లాడి అవసరమైన వైద్య సిబ్బందిని ఏర్పాటు చేయించినట్లు నిర్వాహకులు తెలిపారు.ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలు ఎంతోఉపయోగపడతాయని డాక్టర్ సంపత్ కుమార్ తెలిపారు.ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సంపత్ కుమార్ తెలిపారు.

ఈ కార్యక్రమంలో ప్రభుత్వ అధికారులు, కాంగ్రెస్ కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు, లయన్స్ క్లబ్ సభ్యులు, వైద్య సిబ్బంది,ప్రజలు పాల్గొన్నారు.



## గురువు జగన్మోహన్ రెడ్డికి శిష్యుల కన్నీటి వీడ్కోలు

### – అంతిమయాత్రలో పాడె మోసి నివాళులర్పించిన మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్, శిష్యబృందం



**వనపర్తి, ఆగస్టు 7 (ప్రజాజ్యోతి):** వేలాది మంది విద్యార్థులను క్రమశిక్షణ కలిగిన యువతగా తీర్చిదిద్దిన ప్రముఖ వ్యాయామ అధ్యాపకులు (ఫిజికల్ డైరెక్టర్) జగన్మోహన్ రెడ్డి వృద్ధాప్యంతో శుక్రవారం ఉదయం వనపర్తి జిల్లా కేంద్రంలోని తన నివాసంలో కన్నుమూశారు. ఆయన మృతి విద్యా రంగానికి, శిష్యులకు తీరని లోటని మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్ అన్నారు. దశాబ్దాల పాటు విద్యార్థుల శారీరక, మానసిక వికాసానికి విశేష సేవలందించిన జగన్మోహన్ రెడ్డి అంతిమయాత్రకు వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన ఆయన శిష్యులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. గురువుపై తమ అభిమానాన్ని చాటుతూ పార్థివదేహానికి పూలమాలలు సమర్పించి, పాడె మోసి భావోద్వేగంతో చివరి వీడ్కోలు పలికారు. పలువురు శిష్యులు గురువు పాదాలకు నమస్కరించి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గట్టు యాదవ్, పెద్దయ్య, భీంరెడ్డి, వెంకటరెడ్డి, మురళి, నాగార్జున్, రఘువీర్ రెడ్డి, రవిశంకర్, మల్లి, ట్రాన్స్‌కో చంద్రశేఖర్, శివ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్ పరీక్షకు దరఖాస్తుల ఆహ్వానం

మహబూబ్‌నగర్, ఆగస్టు 7( ప్రజా జ్యోతి బ్యూరో ): జిల్లాలోని ప్రభుత్వ, స్థానిక సంస్థలు, ప్రైవేట్ యాజమాన్య పాఠశాలల్లో చదువుతున్న 8వ తరగతి విద్యార్థుల కోసం నిర్వహించే నేషనల్ మీన్స్-కమ్-మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్ష-2026కు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి తెలిపారు. ఈ పరీక్షను 2026 నవంబర్ 1న జిల్లా కేంద్రంలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అర్హులైన విద్యార్థులు డీజీఈ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తుల సమర్పణకు ఆగస్టు 24, 2026 చివరి తేదీగా నిర్ణయించారు. దరఖాస్తు ఫీజు ఓసీ/బీసీ విద్యార్థులకు రూ.100, ఎస్సీ/ఎస్టీ/పీహెచ్ విద్యార్థులకు రూ.50గా నిర్ణయించారు. ఫీజు చెల్లింపు కూడా ఆగస్టు 24లోగా పూర్తి చేయాలని తెలిపారు. పరీక్షకు సంబంధించిన పూర్తి సమాచారం, దరఖాస్తు ప్రక్రియపై సందేహాల నివృత్తి కోసం జిల్లాలోని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు (హెచ్ఎంలు), మండల విద్యాధికారులు (ఎంఈవోలు) అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి సూచించారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని స్కాలర్‌షిప్‌కు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

# ఎమ్మార్పీఎస్ పోరాట ఫలితమే 'ఆరోగ్యశ్రీ'

## మందకృష్ణ మాదిగ పోరాట ఫలితమే ఆరోగ్యశ్రీ
## చిన్నంబావిలో ఘనంగా ఆరోగ్యశ్రీ సాధన దినోత్సవం





**చిన్నంబావి, ఆగస్టు 7 (ప్రజాజ్యోతి)**
పేద ప్రజలకు ఆరోగ్యశ్రీ పథకం ఒక వరంగా మారిందని ఎమ్మార్పీఎస్ నాయకులు పేర్కొన్నారు. ఆరోగ్యశ్రీ పథకం సాధన కోసం పద్మశ్రీ మందకృష్ణ మాదిగ నాయకత్వంలో జరిగిన పోరాటం చారిత్రాత్మకమని అన్నారు. ఆ ఉద్యమ ఫలితంగానే గుండె జబ్బులతో బాధపడుతున్న పేద చిన్నారులకు కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఉచితంగా శస్త్రచికిత్సలు చేయించే కార్యక్రమానికి మార్గం సుగమమైందని తెలిపారు.చిన్నంబావి మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద శుక్రవారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఆరోగ్యశ్రీ సాధన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జి దేవని రమేష్ మాదిగ, సీనియర్ నాయకులు కత్తి కురుమూర్తి మాదిగ, పసుపుల రంజిత్‌కుమార్ మాదిగ తదితరులు మాట్లాడారు.గుండె జబ్బు చిన్నారుల కోసం కులం, మతం, వర్గం అనే తేడా లేకుండా గుండె జబ్బులతో బాధపడుతూ ప్రాణాలు కోల్పోతున్న వేలాది మంది చిన్నారులను కాపాడాలనే లక్ష్యంతో మందకృష్ణ మాదిగ ఉద్యమాన్ని చేపట్టారని నాయకులు గుర్తుచేశారు. గుండె జబ్బు ఉన్న పిల్లలకు ప్రభుత్వమే ఉచితంగా కార్పొరేట్ ఆసుపత్రుల్లో శస్త్రచికిత్సలు చేయించి వారి ప్రాణాలను కాపాడాలని డిమాండ్ చేస్తూ ఉద్యమాన్ని ఉధృతం చేశారని తెలిపారు.జబ్బుపడ్డ చిన్నారులు, వారి తల్లిదండ్రులను హైదరాబాద్‌కు రప్పించి లోయర్ ట్యాంక్‌బండ్‌లోని అంబేద్కర్ భవన్‌లో సభ నిర్వహించిన సమయంలో వ్యాధి ముదిరి శోభన్ అనే చిన్నారి మృతి చెందాడని పేర్కొన్నారు. అయినా ప్రభుత్వం స్పందించకపోవడంతో ఆ చిన్నారి మృతదేహాన్ని చేతబట్టి ట్యాంక్‌బండ్‌పై పాదయాత్ర నిర్వహించి, అంబేద్కర్ విగ్రహం ఎదుట వేలాది మంది చిన్నారులు, తల్లిదండ్రులు, ఎమ్మార్పీఎస్ కార్యకర్తలతో ధర్నాకు దిగినట్లు వివరించారు.ఉద్యమం కారణంగా హైదరాబాద్--సికింద్రాబాద్ జంట నగరాల ట్రాఫిక్ స్తంభించే పరిస్థితి ఏర్పడిందని నాయకులు తెలిపారు. అప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినప్పటికీ.. 'ముందు బిడ్డలను కాపాడాలి.. సమస్య పరిష్కారం అయ్యే వరకు ఇక్కడి నుంచి కదిలేది లేదు' అంటూ మందకృష్ణ మాదిగ పట్టుదలతో ఉద్యమాన్ని కొనసాగించారని పేర్కొన్నారు.దీంతో ప్రభుత్వం దిగిరాక తప్పలేదని, గుండె జబ్బులతో బాధపడుతున్న చిన్నారులందరికీ ప్రభుత్వమే ఉచితంగా శస్త్రచికిత్సలు చేయిస్తుందని అప్పటి ముఖ్యమంత్రి ప్రకటించారని నాయకులు గుర్తుచేశారు. మందకృష్ణ మాదిగ నాయకత్వంలో జరిగిన గుండె జబ్బు చిన్నారుల మహోద్యమ స్ఫూర్తితోనే ఆరోగ్యశ్రీ పథకాన్ని తీసుకొచ్చామని అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి అసెంబ్లీ సాక్షిగా ప్రకటించిన విషయాన్ని వారు ప్రస్తావించారు.ఆర్థిక స్థోమత లేని పేద కుటుంబాలకు ఖరీదైన వైద్యాన్ని అందుబాటులోకి తీసుకురావడంలో ఆరోగ్యశ్రీ కీలక పాత్ర పోషిస్తోందని ఎమ్మార్పీఎస్ నాయకులు తెలిపారు. అయితే ఈ పథకం కోసం జరిగిన అసలు పోరాట చరిత్రను మరచిపోవద్దని సూచించారు. వివిధ ప్రభుత్వాలు తామే ఆరోగ్యశ్రీని తీసుకొచ్చామని, తామే విస్తరించామని చెప్పుకుంటున్నప్పటికీ.. పేదల ప్రాణాల కోసం జరిగిన తొలి ఉద్యమాన్ని, దాని వెనుక ఉన్న పోరాటాన్ని చరిత్ర నుంచి చెరిపివేయలేరని అన్నారు.ఆరోగ్యశ్రీ పథకానికి అసలు సిసలైన హక్కుదారులు మందకృష్ణ మాదిగ, ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు. పేదల ప్రాణాల కోసం సాగిన పోరాటం వల్లే ఈ పథకానికి బీజం పడింది. చరిత్రను ఎవరూ తుడిచివేయలేరు.. మార్చలేరు" అని నాయకులు పేర్కొన్నారు.ఖమ్మం జిల్లాకు చెందిన హసీనా అనే గుండె జబ్బు చిన్నారి తన సమస్యను మందకృష్ణ మాదిగ దృష్టికి తీసుకురావడంతో ఈ సమస్య ఒక్కరి సమస్య కాదని, ఇలాంటి వ్యాధులతో బాధపడుతున్న అనేక మంది చిన్నారులు ఉన్నారని గుర్తించి ఉద్యమాన్ని విస్తృతం చేసినట్లు తెలిపారు.ప్రతి పేద కుటుంబానికి ఉచితంగా, నాణ్యమైన వైద్యం అందించడం ప్రభుత్వ బాధ్యత అని నాయకులు పేర్కొన్నారు. ఆరోగ్యశ్రీ పథకాన్ని మరింత పటిష్టంగా అమలు చేసి పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కోరారు. ప్రజల ఆరోగ్య హక్కు కోసం మందకృష్ణ మాదిగ నాయకత్వంలో భవిష్యత్తులోనూ ఉద్యమాలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు ప్రజా జ్యోతి రిపోర్టర్ సులిగిరి శ్రీనివాసులు మాదిగ, వై.స్వామి మాదిగ, గాండీవం రిపోర్టర్ బోరెల్లి జయరాం మాదిగ, డి.ఎన్. కృష్ణ మాదిగ, డి.ఎన్. సహదేవుడు మాదిగ, శివకృష్ణ మాదిగ, కాకనూరి కృష్ణ మాదిగ, వై. తిరుపతయ్య మాదిగ, పానుగంటి శ్రీనివాస్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా శ్రీ కొండా లక్ష్మణ్ బాపూజీ అవార్డుకు కేంచే నాగమణి ఎంపిక



**నారాయణపేట ప్రతినిధి ఆగస్టు 07( ప్రజా జ్యోతి)**
జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన ప్రతిష్ఠాత్మక శ్రీ కొండా లక్ష్మణ్ బాపూజీ చేనేత అవార్డుకు ప్రముఖ చేనేత కళాకారిణి శ్రీమతి కేంచే నాగమణి కోటకొండ గ్రామం, నారాయణపేట మండలం ఉ జిల్లా గారు ఎంపిక కావడం పట్ల హర్షం వ్యక్తమవుతోంది. ఈ అవార్డుల ద్వారా చేనేత రంగంలో విశేష సేవలు అందించిన కళాకారులను రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరం సత్కరిస్తోంది.శ్రీమతి కేంచే నాగమణి గత 40 సంవత్సరాలుగా చేనేత రంగంలో అంకితభావంతో సేవలందిస్తూ, అనేక కష్టాలను అనుభవించి,అరుదైన మరియు వినూత్న డిజైన్లతో చేనేత కళకు ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చారు. స్వశక్తితో ఎన్నో సవాళ్లను అధిగమిస్తూ, ఒంటరి మహిళగా జీవన పోరాటాన్ని కొనసాగిస్తున్నారు.ప్రస్తుతం 58 సంవత్సరాల వయస్సులో కూడా స్వయంగా మొగ్గం నేస్తూ, చేనేత వృత్తినే జీవనాధారంగా కొనసాగించడం ఆమె కృషి, పట్టుదలకు నిదర్శనం. ఆమెకు ఈ ప్రతిష్ఠాత్మక అవార్డు లభించడం చేనేత కళాకారులకు గర్వకారణం మాత్రమే కాకుండా, యువతకు స్ఫూర్తిదాయకం కూడా.ఈ సందర్భంగా శ్రీమతి కేంచే నాగమణి మాట్లాడుతూ, "తెలంగాణ ప్రభుత్వం నా సేవలను గుర్తించి శ్రీ కొండా లక్ష్మణ్ బాపూజీ అవార్డుకు ఎంపిక చేయడం నాకు ఎంతో ఆనందంగా ఉంది. ఈ గుర్తింపు చేనేత రంగంలో మరింత సేవ చేయడానికి నాకు ప్రేరణనిస్తుంది. చేనేత కళను కాపాడుతూ, భవిష్యత్ తరాలకు అందించేందుకు నా వంతు కృషి కొనసాగిస్తాను" అని తెలిపారు.ఈ సందర్భంగా ఆమెకు పలువురు చేనేత కళాకారులు, ప్రజాప్రతినిధులు, ప్రగతి చేనేత సొసైటీ అధ్యక్షులు సౌదం నరసింహులు, మాస్ లైన్ జిల్లా నాయకులు కె కాశీనాథ్, మాస్ లైన్ పార్టీ నాయకులు సాకలి లాలూ ప్రసాద్ , నీలి దామోదర్ , ఎదురింటి నరసింహులు, వార్డు సభ్యులు రఫిక్ , ప్రగతి చేనేత సొసైటీ కార్యదర్శి భోగం అశోక్, సంఘ రాము తదితరులు హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు.



## జర్నలిస్టుల బాసు పాస్ 1/3 టికెట్ ఎలా కొట్టాలో కూడా తెలియదంట కండక్టర్ కి

### –మాకు ట్రైనింగ్ ఇవ్వలేదు అని సమాధానం చెప్పిన గద్వాల డిపో కండక్టర్, డ్రైవర్



**గద్వాల( ప్రజా జ్యోతి) ఆగస్టు 07:**
జోగులాంబ గద్వాల జిల్లా గద్వాల డిపో చెందిన కండక్టర్లకు కొందరికి గద్వాల నుండి హైదరాబాద్ మరి యూ హైదరాబాద్ నుండి జడ్చర్ల వరకు జర్నలిస్టుల బస్ పాస్ 1/3 టికెట్ ఎలా కొట్టాలో మాకు ట్రైనింగ్ ఇవ్వలేదు అని సమాధానం ఇచ్చారు అంత మాత్రమే కాకుండా జర్నలిస్టులు బస్ పాస్ చూపిస్తే ఏం కార్డు అని అడుగుతున్నారు. కార్డుల విషయంపై గద్వాల్ డిపో మేనేజర్ కండక్టర్లకు అవగాహన కల్పించాలని జర్నలిస్టులు కోరుతున్నారు.ఎందుకంటే ఆ కార్డు ఎక్కడి నుంచి ఎక్కడిదాకా వర్తిస్తుంది మరి 1/3 పాస లేకపోతే జిల్లా పాస 1/3టికెట్ అంటే మిషన్ లో ఎలా కొట్టాలి అనేది తెలుసుకొని టికెట్ కొట్టే విధంగా వారికి అవగాహన కల్పించాలని ఎందుకంటే కొందరికి మిషన్ లో ఎలా టైప్ చేయాలో కూడా తెలియదు కాబట్టి వారికి అవగాహన కల్పించాలని జర్నలిస్టులు కోరుతున్నారు.

## బిఆర్ఎస్ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షులు కోరం శివరాజ్ రెడ్డి ఆధ్వర్యంలో డీఈవో ఆఫీస్ ముట్టడి



**నారాయణపేట ప్రతినిధి ఆగస్టు 07 (ప్రజా జ్యోతి)**
నిన్న నారాయణపేట పట్టణ శివారులోని ఏక్లాస్పూర్ గ్రామంలో మూడవ తరగతిలో చదువుతున్న రంజిత్ అనే విద్యార్థి పాము కాటుకు గురై చనిపోయినందున పాఠశాల విధులలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఉపాధ్యాయులను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ బిఆర్ఎస్వి ఆధ్వర్యంలో ఐజూా కార్యాలయం ముట్టడి చేయడం జరిగింది. గతంలో ఎన్నోసార్లు ప్రభుత్వ పాఠశాలలలో మౌలిక వసతులు కల్పించాలని వినతి పత్రాలు అందించినా ఎలాంటి చర్యలు తీసుకోనందువల్లే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని తెలియజేయడం జరిగింది.శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని ఐజూా గారు హామీ ఇవ్వడం జరిగింది. ఇట్టి నిర్లక్ష్య ధోరణిని బిఆర్ఎస్ విద్యార్థి విభాగం సహించబోదని హెచ్చరించడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో బిఆర్ఎస్ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షులు కోరం శివరాజ్ రెడ్డి,మరియు కొలు నరేష్,శరత్ వినయ్ రెడ్డి,తరుణ్ ,సమీర్,ఇర్ఫాన్ ,తౌసీఫ్ లక్ష్మినారాయణ,భరత్ రెడ్డి,నితీష్ రమేష్ మరియు తదితర బిఆర్ఎస్వి నాయకులు పాల్గొనడం జరిగింది.

## విద్యార్థి మృతిపై ప్రభుత్వం వెంటనే స్పందించాలి

### బిఆర్ఎస్ కౌన్సిలర్ నాదేపల్లి భరత్



**నారాయణపేట ప్రతినిధి ఆగస్టు 07 (ప్రజా జ్యోతి)**
గురువారం నాడు నారాయణపేట మండలంలోని ఎక్లాస్పూర్ గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో పాముకాటుకు గురై 3వ తరగతి చదువుతున్న రంజిత్ (8) అనే విద్యార్థి మరణించడం పట్ల బిఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్ నాదేపల్లి భరత్ గారు స్పందిస్తూ పాఠశాల ప్రాంగణం అపరిశుభ్రత గురించి ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాల నిర్వహణలో అశ్రద్ధ వహించిన ఉపాధ్యాయులపై శాఖా పరమైన చర్యలు తీసుకోవాలని, ఇకపై ఇలాంటి సంఘటనలు జరగకుండా అధికారులు తగిన నిబంధనలను పాటించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా జిల్లా కేంద్రంగా ఉన్న నారాయణపేట పట్టణంలో ప్రభుత్వ వైద్యం అందుబాటులో లేకపోవడం వల్ల ఇప్పటికే చాలా ప్రాణనష్టం జరిగిందని ఇప్పటికైనా సంబంధిత అధికారులు,ప్రభుత్వం సరైన రీతిలో స్పందించకపోతే బిఆర్ఎస్ పార్టీ భారీ స్థాయిలో ఉద్యమిస్తుందని హెచ్చరించారు.